
# సానుభూతి కాదు - సహకారం కావాలి

**- పాలకోడేటి కృష్ణమూర్తి**



హైదరాబాద్‌లోని స్వచ్ఛంద సంస్థ 'ప్రగతి' నుంచి నాకు ఆహ్వాన పత్రిక అందింది. ఈ సంస్థగురించి చాలా విషయాలు విన్నాను. హెచ్‌ఐవి బాధితులను ఆదుకునేందుకు ఏర్పడిన సంస్థ అది. ఎయిడ్స్ రహిత సమాజస్థాపనలో భాగంగా ఏర్పాటు చేసిన సభలో నన్నూ పాల్గొనమని ఆహ్వానించారు. వృత్తిరీత్యా లెక్చరర్, ప్రవృత్తి రీత్యా సంఘసేవిక అయిన నాకు అటువంటి ఆహ్వానాలు అందడం కొత్త కాదు. అయినా ఎయిడ్స్ బాధితుల సహాయం కోసం కృషి చేస్తున్న అటువంటి సంస్థ నుంచి ఆహ్వానం రావడం నాకు ఆనందాన్నే కలిగించింది.

చాప కింద నీరులా విజృంభిస్తున్న ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొట్టడానికి ప్రజలని చైతన్య వంతులు చేయడానికి సంస్థ చేస్తున్న కృషిలో భాగంగా ఏర్పాటు చేసిన సభ అది. నేటి సామాజిక పరిస్థితులలో ఎయిడ్స్ గురించి ప్రజలని జాగృత పరిచి చైతన్యం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా వుంది.

అనుకున్న రోజుకి సభకి వెళ్లాను. పెద్దలు చాలా మంది వచ్చారు. కార్యక్రమం ఆరంభమయింది. ప్రసిద్ధి చెందిన డాక్టర్ శ్రీనివాస్ ఆ సభకి అధ్యక్షులు. ఆయన తన ఉపన్యాసం ప్రారంభిస్తూ ముందుగా నన్నే సభకు పరిచయం చేశారు.

''కళ్యాణి దంపతులు తమ తప్పేం లేకుండానే జీవితంలో అనేక కష్టాలను అనుభవించారు. ఈమె భర్త ప్రాణాంతక వ్యాధి అయిన ఎయిడ్స్ బాధితుడు. వ్యాధి సంగతి బయటపడగానే వీరిని సమాజం వెలివేసినట్లు చూసింది. వారికి అత్తింట్లో స్థానం లభించలేదు. పుట్టింటికి వెళ్తే అదనపు బరువుగానే చూస్తారని ఆమెకు తెలుసు. అవమానాలు దిగమింగుకుంటూ కల్లలైన కలలను తలచుకుంటూ జీవితాన్ని గడిపారు. తన వ్యక్తిగత జీవితంలో ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా లెక్కచేయకుండా ఆత్మస్థయిర్యంతో వాటిని ఎదుర్కొన్న వ్యక్తి ఈమె. ఎయిడ్స్ రోగిని అసహ్యించుకోవడం, అవమానపరచడం కాక ఆదరించి ధైర్యం చెప్పాలని మాటల్లోనే కాక చేతల్లోనూ రుజువు చేసిన వ్యక్తి. స్వయంగా తన భర్తే ఎయిడ్స్

బారిన పడ్డా అందువల్ల తన జీవితం అగచాట్లపాలయినా జరిగినదానికి విచారపడక ఆత్మస్థైర్యంతో పరిస్థితులను ఎదుర్కొని భర్త సేవకే కంకణం కట్టుకున్న ఆదర్శ మహిళ'' అంటూ అధ్యక్షులు నా గురించి చెబుతుంటే కళ్ల ముందు నా గతమంతా గిర్రున తిరిగినట్లయింది...

***

ఆ రోజు ఆదివారం. ఆ రాత్రి నిద్రపట్టక మా ఆయన సుమంత్ మెలికలు తిరిగిపోసాగారు. నాకు భయమేసింది. సుమంత్ రెండు వారాలుగా జ్వరంతో బాధపడుతున్నారు. జ్వరం తగ్గడం లేదు. ఎన్ని మందులిచ్చినా వృథా అవుతున్నాయి. నేను చాలా కంగారు పడ్డాను. మర్నాడు హాస్పిటల్‌లో జాయిన్ చేశాను. రక్త పరీక్షలు అన్నీ చేసిన తర్వాత అసలు విషయం బయటపడింది. రక్తపరీక్ష ద్వారా సుమంత్ రక్తం హెచ్ఐవి పాజిటివ్ అని తేలింది. డాక్టరు చెప్పింది వినడంతోనే నా కళ్లలోంచి నీరు ఉబికింది. ఒక్కసారి గుండెల్లో బాంబు పేలినట్లయింది. నేను అవిశ్వాసంతో డాక్టరు వైపు చూస్తూ ....

''ఇలా ఎలాగయ్యింది డాక్టరు గారూ! టెస్టులన్నీ సరిగ్గా చేశారా?'' అని అడిగాను ఆదుర్దాగా

''అన్నీ సరిగ్గానే చేశాం. ఇక చేయాల్సింది మీకే. మీ రక్తం కూడా పరీక్షించాలి'' అంటూ నా రక్తం కూడా తీసుకొన్నారు.

నాకు పై ప్రాణాలు పైకి పోయినట్లయింది. నా భర్త పట్ల వున్న విశ్వాసం కొద్దిగా సడలింది. ఆ రోజు సుమంత్ ఆఫీసుకి వెళ్లలేదు. నేను కాలేజీకి సెలవు పెట్టాను. నాకు ఏ పనీ చేయడానికి మనస్కరించలేదు.

మరునాడు మళ్లీ డాక్టరు దగ్గరకి వెళ్లాను. నా రిపోర్టు వచ్చింది. నెగిటివ్. దాంతో ''ఎందుకిలా జరిగింది'' అడిగారాయన.

''అదే నాకు అర్థం కావడం లేదు డాక్టర్‌గారూ! సుమంత్ చాలా మంచి వ్యక్తి. ఎటువంటి దురలవాట్లు లేవు. ఆయనకు ఎయిడ్స్‌కు సంబంధించిన హెచ్ఐవి క్రిములు ఎలా సోకాయో అర్థం కావడం లేదు'' నమ్మకంగా బదులిచ్చాను.

ఆరోజు డాక్టరు గారు ఎన్నో ప్రశ్నలు గుచ్చి గుచ్చి అడగడంతో కొన్ని రోజుల క్రితం సుమంత్ స్నానం చేస్తూ బాత్‌రూమ్‌లో జారి పడిన సంఘటన గుర్తుకొచ్చింది. వెంటనే డాక్టరు గారికి ఆ విషయం చెబుతూ ''తలకు దెబ్బ తగలడంతో చాలా రక్తం పోయింది. మా ఇంటికి దగ్గరలో వున్న నర్సింగ్ హోమ్‌కి తీసుకెళ్లాం. అక్కడ చికిత్స చేసి రక్తం ఎక్కించారు.'' అంటూ వివరించాను.

నేను ఆ మాట అనగానే డాక్టరు గారి ముఖకవళికలు మారాయి.

''మీ దగ్గర ట్రీట్‌మెంటు, రక్తం ఎక్కించిన వివరాలు వున్నాయా?'' అంటూ సీరియస్‌గా అడిగారు.

''ఆ వివరాలు లేవు. కానీ వెంటనే రక్తం ఎక్కించాలి. లేకుంటే ప్రాణానికి ప్రమాదం అని చెప్పడంతో అక్కడున్న అటెండరు ఓ రక్తదాతని తీసుకొచ్చాడు. వెంటనే అతని రక్తం ఎక్కించారు'' అని చెప్పాను.

డాక్టరు వివరాలు కనుక్కోమని చెప్పడంతో నేను నర్సింగ్‌హోమ్‌కి వెళ్లి అక్కడి డాక్టరుని కలిశాను. నేను చెప్పిందంతా సౌమ్యంగా విన్నాడాయన.


''మీరు దయచేసి మీ నర్సింగ్‌హోమ్‌లో పనిచేసే అటెండర్‌ని పిలిపించండి. రక్తదాత వివరాలు తెలుస్తాయి'' అన్నాను.

''సారీ! ఇప్పుడుతను ఇక్కడ లేడు'' అన్నాడు డాక్టరు ముభావంగా.

''అతను ఇప్పుడెక్కడున్నాడో, అతని పేరేంటో చెప్పండి ప్లీజ్. ఎందుకంటే మేము మానసికంగా ఎంత బాధపడుతున్నామో మీరు గ్రహించే వుంటారు'' అన్నాను.

''చెప్పానుగా అతనిప్పుడిక లేడని''అన్నాడు డాక్టరు కించిత్తు కోపంగా.

''మీకు అన్నీ తెలుసు. మీరు కావాలనే అతని వివరాలు చెప్పడం లేదు'' అన్నాను బాధగా.




''అతనిప్పుడు ఇక్కడ లేడు. ఆ వివరాలేవీ నాకు తెలియదు. మీరేం చేసుకుంటారో చేసుకోండి'' నిర్లక్ష్యంగా అన్నాడు డాక్టరు.

నేను చేసేదేమీ లేక బాధగా వెనుతిరిగాను. మరునాడు ఆసుపత్రికి వెళ్లి డాక్టరుగారిని కలిసి జరిగిందంతా వివరించాను.

''అనుమానం లేదు. ఆ అటెండరు తీసుకొచ్చిన రక్తదాతకి హెచ్ఐవి ఉందన్నమాట. అతని రక్తం ఎక్కించడంతో మీ వారికి ఈ వైరస్ సోకింది. మీరు చదువుకున్నవాళ్లు. ఆ మాత్రం అవగాహన లేకుండా ఎవరో ముక్కూమొహం తెలియని వ్యక్తిని ఎలా నమ్మారు?'' కోపంగా అరిచినంత పని చేశాడు డాక్టరు.

''మరి ఆ అటెండరు అలా ఎందుకు చేసి వుంటాడంటారు?'' అడిగాను నుదుట పట్టిన చెమటను తుడుచుకుంటూ.

''చూడండి హెచ్ఐవి పాజిటివ్‌గా తేలిన రక్తదాతలను బ్లడ్‌బ్యాంకులు కూడా అది చెప్పక ఎయిడ్స్ వ్యాప్తికి తోడ్పడుతున్నాయి. అంతే కాదు రక్తదాతల్లో ఎవరికైనా హెచ్ఐవి వున్నట్లు తేలినా, రక్త నిధుల వారికి ఆ విషయం తెలపని దిగ్భ్రాంతికర పరిస్థితి నెలకొని వుంది. ఈ విషయాన్ని పేపర్లు కూడా కోడై కూస్తున్నాయి.''

''ఇప్పుడెలా డాక్టరుగారూ!'' కళ్లు తుడుచుకుంటూ వణుకుతున్న కంఠంతో అడిగాను.

''ఇప్పటి వరకూ ఎయిడ్స్ వ్యాధికి సరైన మందు లేదు. అయితే రోగాన్ని అదుపులో వుంచి, మనిషి జీవితకాలాన్ని పెంచే అవకాశం మాత్రం వుంది. మందుల మిశ్రమాలు, అనుబంధ ఆహారాలతో వ్యాధి పెరగకుండా చేయవచ్చు. దీనితో పాటు పోషకాహారం కూడా ముఖ్యమే''

''నాకు ఏడుపు వచ్చినంత పనైంది''

''ఏంటి డాక్టర్ మీరనేది? అంటే నా భర్త బతకడంటారా?''

''ఈ వైరస్ సోకిన వెంటనే మరణం సంభవించదు. కొందరు పదేళ్లకు పైగా జీవించిన సందర్భాలు కూడా లేకపోలేదు. కానీ బతికే అవకాశాలు తక్కువ. అంతేకాదు. ఒక విషయం గుర్తుంచుకోండి. ఇంట్లోవారు సైతం మిమ్మల్ని దూరంగా వుంచుతూ మీ పట్ల కఠినంగా వ్యవహరించే పరిస్థితులు ఏర్పడవచ్చు. అందుకు సిద్ధంగా వుండండి'' అన్నారు డాక్టరు.

బరువెక్కిన హృదయంతో ఇంటికి చేరుకున్నాను. సుమంత్‌కి హెచ్ఐవి సోకిందనే వార్త అందరికీ తెలిసిపోయింది. అందరూ దగ్గిర బంధువులు సైతం మమ్మల్ని నిరసనగా చూడడం ప్రారంభించారు. ఆరోజు ఉదయం గుమ్మంలో ఆటో ఆగిన చప్పుడయ్యింది. నేను గబగబా బయటకి వచ్చాను. మా అమ్మా, నాన్న, అన్నయ్య ఆటో దిగారు.

''ఎంత కష్టమొచ్చిందమ్మా నీకు ఈ వయసులోనే'' అంటూ నన్ను కౌగిలించుకొని భోరుమంది మా అమ్మ ఆటో దిగుతూనే. వాళ్లని సాదరంగా లోపలకి తీసుకొచ్చాను.

''అల్లుడు గారు ఏరి?'' అడిగారు.

''ఆయన అర్జంటు పని మీద క్యాంపు కెళ్లారు. ఓ పది రోజుల దాకా రారు'' చెప్పాను.

ఆ రోజు భోజనాలు చేసిన తర్వాత డాక్టరు గారు చెప్పిన విషయాలన్నీ వివరంగా చెప్పాను వాళ్లకి.

''అన్నీ మాకు తెలిశాయి. మీ పక్కింటి రామనాథంగారు మాకు ఫోన్ చేసి సుమంత్‌కి హెచ్ఐవి సోకిందని చెప్పారు. మేము వెంటనే రాత్రి బయలుదేరి వచ్చేశాం'' అన్నారు నాన్న.

''చూడమ్మా ఆరోగ్యం నయమవ్వడానికి అవకాశం లేదన్నది అందరికీ తెలిసిందే. రోగిష్టి భర్తతో ఎంతకాలమని వేగుతావు? నీకు నిండా ముప్ఫై సంవత్సరాలు కూడా లేవు. మిగతా జీవితం ఎలా గడుపుతావు? మనింటికి పోదాం వచ్చేయ్'' అంది అమ్మ

''జీవితాంతం పీడించే ఎయిడ్స్ బదులుగా బావగారు ఏ దుర్ఘటనలోనైనా మరణించి వుంటే బాగుండేది. ఆయనకి ముక్తి లభించడమే కాకుండా మనమూ ఓ ఏడ్పు ఏడ్చి ఊరుకునేవాళ్లం'' అన్నాడు అన్నయ్య నిర్మొహమాటంగా.

''చావబోయే వాళ్లతో మనం కూడా చావలేం కదా? అతని కోసం నీ జీవితాన్ని ఎందుకని నాశనం

చేసుకుంటావు?'' అన్నారు నాన్న.

వాళ్ల మాటలు నన్ను బాధించాయి. అసలే పుట్టెడు దుఃఖంతో వున్న నన్ను ఓదార్చాల్సింది పోయి వాళ్లు ఇలా మాట్లాడ్డంతో కళ్లనీళ్ల పర్యంతమయ్యాను.

''మీరేం మాట్లాడుతున్నారో మీకు తెలిసే మాట్లాడుతున్నారా? సుమంత్ గురించి ఇలాగేనా మాట్లాడాల్సింది. ఆయన మీ అల్లుడు. నాకు భర్త. కష్టాల్లో సుఖాల్లో ఒకరికొకరం తోడుగా వుంటాం అని పెళ్లినాడు ప్రమాణాలు చేసుకున్న మేము ఈ రోజు హెచ్ఐవి సోకిందని ఆయన్ను వదిలి ఎలా వస్తామనుకుంటున్నారు. పాజిటివ్ వ్యక్తుల్ని, ఎయిడ్స్ బాధితుల్ని సమాజం, కుటుంబాలు నిరాదరించడం అన్యాయం కాదా. ఆయనకి అండగా నిలిచి, ఆయన ధైర్యంగా జీవితాన్ని కొనసాగించే పరిస్థితులు సృష్టించాల్సిన బాధ్యత నాపై వుంది. అది మర్చిపోయి నాకు కర్తవ్యం బోధించాల్సింది పోయి ధైర్యం చెప్పాల్సింది పోయి ఇలా గేనా మీరు మాట్లాడేది?'' అంటూ కోపంగా అరిచాను. కళ్ల వెంట నీరు ధారపాతంగా కారుతూనే వుండగా...

''అది కాదు కళ్యాణి. నువ్వు అపార్థం చేసుకోకు. ఎయిడ్స్ అన్నది చికిత్సలేని భయంకర రోగం. అటువంటి రోగం వున్న వ్యక్తితో నువ్వు ఎలా వేగుతావు? నీ జీవితాన్ని కూడా ఎందుకు వృథా చేసుకుంటావు? '' అన్నారునాన్న.

కొద్దిరోజుల క్రితం మా అత్తగారు, మావగారు కూడా కన్నకొడుకన్న జ్ఞానం లేకుండా ఇలానే మాట్లాడారు.

''కళ్యాణీ...నువ్వు మీ ఆయన వేరే వుండడం మంచిది. ఎయిడ్స్ వున్న మనిషిని ఎంత కొడుకైనా ఇంట్లో ఎలా వుంచుకుంటాం? వెంటనే మీరు మీ దారి చూసుకోవడం మంచిది''అన్నారు. నాకు ఆ మాటలు జ్ఞాపకం వచ్చాయి. బాధ కలిగింది.

ఇప్పుడు మా అమ్మానాన్న కూడా ఆయనను విడిచి తమతో రమ్మంటున్నారు. కానీ నేను వారి మాటలు వినిపించుకోలేదు. మా ఆయనను విడిచి రానన్నా. దాంతో మా అమ్మ,నాన్న, అన్నయ్య కోపం తెచ్చుకొని సామాను సర్దుకుని వెళ్లిపోయారు.

ఆ రాత్రి నిద్రపట్టక అటూ ఇటూ దొర్లసాగాను. ఆఫీసు పనిమీద ముంబాయి వెళ్లిన సుమంత్‌తో సెల్‌ఫోన్‌లో మాట్లాడాను. ఇంట్లో జరిగిన విషయాలన్నీ వివరంగా చెప్పాను. నన్ను ఇక ఆ ఇంట్లో వుండొద్దని మరోచోట ఎక్కడైనా అద్దెకు ఇల్లు తీసుకోమని, తాను వచ్చాక అన్ని విషయాలు మాట్లాడుకుందామని అన్నాడు. ఎంతో బాధాతప్త హృదయంతో మాట్లాడినట్టున్నాయి ఆయన మాటలు.

పుట్టింటి వారు, అత్తింటి వారి మాటలు తీవ్ర మనస్తాపాన్ని కలిగించడంతో ఆ రాత్రి నాకు నిద్రపట్టలేదు. స్వార్థం కర్తవ్య భావనల మధ్య సంఘర్షణ చెలరేగడంతో నా మనసతంతా కల్లోల కడలి తరంగమైంది. ఎలాగోలా గుండె నిబ్బరం చేసుకొని ఓ నిర్ణయానికి వచ్చాను. మరునాడు ఉదయం గబగబా నా గదిలోకి వెళ్లి సూట్‌కేసులో బట్టలు సర్దుకొని ఎవ్వరితో ఏమీ మాట్లాడకుండా బయటకి వచ్చేశాను. ఎక్కడికెళుతున్నావు అని అడగడం కానీ, నన్ను ఆపే ప్రయత్నం కానీ ఎవరూ చేయలేదు. అత్తగారు, మావగారు మౌనంగా ప్రేక్షకపాత్ర వహించారు. నేను సూట్ కేసు తీసుకొని తిన్నగా నా క్లాస్‌మేట్ సునీత ఇంటికి వెళ్లాను.

పెద్ద బంగళా...

నేను కాలింగ్ బెల్ నొక్కడంతోటే తలుపు తీసింది సునీత. నన్ను చూడ్డంతోటే ఆశ్చర్యంతో...


''అరే కళ్యాణి...నువ్వా?'' అంటూ ఆప్యాయంగా నన్ను పలకరించి లోనికి తీసుకెళ్లింది. సునీత ప్రముఖ గైనకాలజిస్టు. ఆమె భర్త శ్రీనివాస్ కూడా డాక్టరే. వారిద్దరూ నాతో ఎంతో ఆదరంగా మాట్లాడారు. మాటల మధ్యలో నా పరిస్థితిని వివరించాను. వాళ్లు చాలా బాధపడ్డారు. నా కళ్లలో సుడులు తిరుగుతున్న నీళ్లను చూసి....

''మీకేమీ అభ్యంతరం లేకపోతే నువ్వు, మీ ఆయన మా అవుట్ హౌస్‌లో వుండొచ్చు. ప్రస్తుతం అది ఖాళీగానే వుంది '' అంటూ నన్ను ఓదార్చారు.

ఆ రాత్రి సునీత ఇంట్లో పడుకుండిపోయాను. మరునాడు అవుట్ హౌస్‌లో పాలు పొంగించాను. నాకు అవసరమైన సామాన్లు ఇచ్చి నాకు సహాయపడింది సునీత. చెమ్మగిల్లిన కళ్లతో వాళ్లిద్దరికి కృతజ్ఞతలు చెప్పాను.

నేను సుమంత్‌కి ఫోన్ చేసి అడ్రసు చెప్పి నన్ను ఆదరించిన వారి గురించి వివరంగా చెప్పి తొందరగా రమ్మని చెప్పాను. ఆరోజు రాత్రి నిద్రపోయానన్న మాటే గానీ కళ్ల ముందు ఒక్కసారి వివాహసమయంలో సుమంత్ చెరగని నగుమోము కదలాడితే మరోసారి హెచ్ఐవి సోకిన సుమంత్ వాడిపోయిన ముఖం కదలాడసాగింది. వారం రోజులు భారంగా గడిచాయి. ముంబాయి నుంచి సుమంత్ వచ్చేది ఆరోజే. ఉదయాన్నే నిద్ర లేచి సుమంత్ కోసం ఎదురు చూడసాగాను. కాలింగ్ బెల్ మోగడంతో ఆత్రుతగా వెళ్లి తలుపు తీశాను. ఎదురుగా సూట్‌కేస్‌తో సుమంత్. సుమంత్ నన్ను చూడ్డంతోనే బావురుమన్నాడు. అతన్ని చూడ్డంతోనే నాకూ దుఃఖం వచ్చింది.

లోపలికి రాగానే సుమంత్ కుర్చీలో కూర్చుంటూ ''డాక్టరు గారు నాకు ఫోన్ చేసి అన్ని విషయాలు పూసగుచ్చినట్లు చెప్పారు. ఆరోజు నుంచి నేను ఏ పని చేస్తున్నా నా ధ్యాసంతా నీమీదే వుంది''









అన్నాడు సుమంత్.

''బాధపడకండి. నేనున్నానుగా మీకు'' అంటూ ధైర్యం చెప్పాను.

''ఎయిడ్స్ సోకిన వ్యక్తిని దుర్మార్గులుగా, సంఘానికి చీడపురుగులా చూడకూడదు. ఆ వ్యక్తికి ప్రేమ, ఆప్యాయతలు పంచి సరైన పోషకాహారం అందిస్తే అతను మామూలుగానే జీవించగలడు. మానవతా దృక్పథంతో చూస్తూ ఆయుష్షు పెరుగుతుంది. మరణాన్ని చాలాకాలం వాయిదా వేయొచ్చు'' అంటూ అవుట్ హౌస్‌లో అడుగుపెడుతున్న సమయంలో సునీత పలికిన పలుకులు నాకు జ్ఞప్తికి వచ్చాయి.

''సుమంత్ నాకు మాటివ్వు'' అన్నాను.

''దేనికి?''

''నీకు హెచ్ఐవి పాజిటివ్‌గా వుందన్న విషయం నువ్వు పూర్తిగా మర్చిపోవాలి. ఇంతవరకూ మనం జీవితాన్ని ఎలా గడిపామో ఇక ముందు కూడా ఆ విధంగానే ఉత్సాహంగా నవ్వుతూ ప్రేమతో గడపాలి. నాకు మాటివ్వు'' అన్నాను.

అందుకు సమాధానంగా సుమంత్ తన చేతిని నా చేతిలో వేసి చిరునవ్వుతో ''అలాగే'' అన్నాడు.

ఇంతలో సుమంత్ వచ్చిన విషయం తెలిసినట్లుంది. సునీత, ఆమె భర్త వచ్చారు. వాళ్లని చూడగానే సుమంత్ కళ్లల్లో నీళ్లు తిరిగాయి. సునీత చొరవ తీసుకొని సుమంత్‌కి ధైర్యం చెప్పిన తీరు నన్ను ఆశ్చర్యపరిచింది.

''కష్టాల్లో వున్న మాకు అవుట్ హౌస్ ఇచ్చి ఆదుకున్నందుకు మీకు కృతజ్ఞతలు ఎలా చెప్పాలో అర్థం కావడం లేదు'' అన్నాడు సుమంత్.

''ఈ వైరస్ సోకిన వ్యక్తులతో గౌరవపూర్వకంగా ఆదరణ పూర్వకంగా వ్యవహరించడం సమాజంలోని బాధ్యత గల పౌరులుగా అందరి ధర్మం అని కళ్యాణి గుర్తించింది. ఎయిడ్స్ సోకిన వారిని వెలివేయడం, సమాజ బహిష్కరణకు గురిచేయడం వారితో స్నేహ సంబంధాలుతెంచుకోవడం తగని పని అని తెలుసు'' అన్నాడు సాంత్వనగా సునీత భర్త.


''మాకు కాదు. కళ్యాణికి చెప్పాలి కృతజ్ఞతలు. కళ్యాణి భార్యగా లభించడం నిజంగా మీ అదృష్టం'' అందిసునీత.

''అంతేకాదు. మీరు దిగులు చెందాల్సిన పని లేదు. మరణం పొంచి వుందన్న చింత అక్కర్లేదు. క్రమశిక్షణతో కూడిన జీవన శైలిని అలవర్చుకోడానికి ప్రయత్నించండి. ఆహార పానీయాలను తీసుకోవడంలో మెలకువతో వ్యవహరించండి. మీకు ధూమపానం, మద్యపానం వంటి దురలవాలట్లు, వ్యభిచరించడం వంటి దుర్గుణాలు లేవు కాబట్టి సరైన మోతాదులో సరైన మందులు ఇస్తే మీరు ఆరువారాల్లో కోలుకుంటారు. మూడు నెలల్లో మునుపటి వలె ఆరోగ్యవంతులవుతారు'' అంటూ సుమంత్ కేసి చూస్తూ చెప్పాడు సునీత భర్త.

ఆ రోజురాత్రి నేను సుమంత్ కలిసి భోజనం చేసి గతించిన కాలం నాటి విషయాలెన్నో ముచ్చటించుకున్నాం. మా పెళ్లినాటి సంగతులు, హనీమూన్ గడిపిన రోజులు, చూసిన ప్రదేశాలు, మరెన్నో మధురానుభూతులును గుర్తుకు తెచ్చుకున్నాం. మరునాడు సుమంత్ ఎందుకో దిగులుగా వున్నట్లు అనిపించింది. ''ఏమైంది సుమంత్ అలా వున్నావు?'' అడిగాను.

''ఏం లేదు. ఈ జబ్బు నన్ను ఒంటరిని చేస్తుందేమోనని'' అన్నాడు దిగులుగా.

''పొరపాటున కూడా అటువంటి ఆలోచనలు రానివ్వకు సుమంత్. ఆధునిక చికిత్స విధానాల ద్వారా మీరు మృత్యువు బారిన పడకుండా కాపాడుకుంటాను. ఎల్లప్పుడూ మీకు తోడుగా నేనుంటాను'' అంటూ సుమంత్ చేతిలో చెయ్యి వేశాను. సుమంత్ కళ్లలో మెరుపు మెరిసినట్లయింది.




ప్రతిరోజూ మమ్మల్ని చూసేందుకు స్నేహితులో, బంధువులో, పరిచయస్తులో తెలిసినవారో ఎవరో ఒకరు వచ్చేవారు. ఆ కబుర్లూ ఈ కబుర్లు చెపుతూ సానుభూతి వ్యక్తం చేసేవారు. వాళ్లు వెళ్లగానే సుమంత్ నిరాశానిస్పృహలకు లోనయ్యేవాడు. వాళ్లమాటలు మనస్సులోని వ్యాకులతను తగ్గించక పోగా ఎక్కువ చేసేవి. ఈ విషయం గ్రహించి నేను సుమంత్‌కు ధైర్యం చెప్పేదాన్ని. అతని ధ్యాస మరల్చడానికి సుమంత్‌కిష్టమైన వీడియో క్యాసెట్లు తీసుకొచ్చి టీవీ ఆన్ చేసేదాన్ని. పాత బ్లాక్ అండ్ వైట్ సినిమాలంటే సుమంత్ చెవికోసుకునేవాడు. వాటిని తీసుకొస్తే సుమంత్ ఆనందించేవాడు.

ఓ రోజు ఇలాగే టీవీలో ఏదో పౌరాణిక సినిమా చూస్తూ ''కళ్యాణీ...మనిషికి మరణం వుంటుంది. మానవతకు మరణం వుండదు. నేను మరణించిన తర్వాత నువ్వు సుఖంగా వుండాలన్నదే నా కోరిక'' అన్నాడు సుమంత్.

''మీ సాన్నిహిత్యంలో ఎన్నో నేర్చుకున్నాను. అందువల్ల నామనస్సులోంచి మీరు దూరం అయ్యారన్న భావన నాకు ఎన్నటికీ రాదు. '' అంటూ సుమంత్ చేతిని సున్నితంగా నొక్కాను.

''నువ్వుచూపిస్తున్న ప్రేమ, ఆప్యాయత, కరుణ వల్ల నాకుచావంటే భయం కలగడం లేదు'' అన్నాడు సుమంత్ నా చేతిని ఒడిసిపట్టుకుంటూ.

''జీవితం ప్రేమమయం అయినప్పుడు మృత్యువు గురించి ఆలోచించాల్సిన పనేముంది సుమంత్?'' అన్నాను.

''కళ్యాణీ నువ్వెంత మంచిదానివి''చెమ్మగిల్లిన కళ్లతో అన్నాడు సుమంత్.

''థ్యాంక్యూ రేపు మనం ఆసుపత్రికి వెళ్లాలి. విశ్రాంతిగా నిద్రపొండి''అంటూ నా అరచేతులతో సుమంత్ కళ్లు మూశాను పడుకోమన్నట్టుగా.

కొంత సేపటికి సుమంత్ నిద్రలోకి జారుకున్నాడు. నేను చాలాసేపు బలహీనంగా వున్నా, ప్రశాంతంగా వున్న సుమంత్ ముఖాన్ని శ్రద్ధగా చూడసాగాను. తాను మృత్యువుకి దగ్గరవుతున్నాడన్న భావన కలగనీయకుండా సుమంత్‌ని అప్పుడప్పుడు పర్యాటక స్థలాలకి తీసుకెళ్లసాగాను. ఒక్కోసారి ఇద్దరం కలిసి ఇందిరా పార్కులో తివాచీలా పరిచివున్న గడ్డిమైదానంలో గడిపేవాళ్లం. ఒకరి చేతిలో ఒకరం చేతులుంచుకొని ఆ గడ్డి మైదానంలో ఊసులాడుకుంటూ తిరుగుతుంటే సమయం తెలిసేది కాదు. నేను సుమంత్ పట్ల చూపిస్తున్న శ్రద్ధ, ప్రేమ అక్కడున్న వాళ్లకి తెలియంది కాదు. వాళ్లంతా మా అమ్మానాన్నల దగ్గర, అత్తమామల దగ్గర ఇతర సంబంధీకుల దగ్గర నన్ను ప్రశంసించడానికి సంకోచించేవారు కాదు. మా అమ్మా, నాన్నకి నా వ్యవహారం నచ్చేది కాదు. వాళ్లు మా ఇంటికి వచ్చి ఏదో ఒకటి మాట్లాడి విసుగ్గా తిరిగి వెళ్లిపోయేవారు.

ఇలాగే ఒక రోజు మా అమ్మ నేను ఒంటరిగా వున్న సమయంలో నా దగ్గరగా వచ్చి కూర్చొని ''రేపోమాపో చావబోయే సుమంత్ పట్ల ఇంతగా ప్రేమ పెంచుకోవడం మంచిది కాదు కళ్యాణీ. నీకు ముందు ముందు ఎంతో భవిష్యత్తు మిగిలి వుంది. భవిష్యత్తు నిరాశాజనకంగా వుండేలా నీ భర్త పట్ల ప్రేమ పెంచుకోవడం నీకు తగదు'' అంది.

''అమ్మా... మా పెళ్లయి పది సంవత్సరాలే అయినా సుమంత్ నాతో గడిపింది తక్కువ కాలమే అయినా సుమంత్ నాకు తాళి కట్టిన భర్త. ఆయనతో గడపడం నా ధర్మం. జీవించినంతకాలం ఆయనకి సపర్యలు చేయడం, సేవ చేయడం ఆయనకు ఏలోటు రాకుండా చూడ్డమే నా ఆశయం. ఇక ముందు ఇలాంటి అనవసర ప్రస్తావనలు తీసుకురాకు'' అన్నాను.

కాలచక్రం ఎవరికోసమూ ఆగదు. అది తనమానాన తాను తిరుగుతూనే వుంటుంది. కాలక్రమేణా సుమంత్ శారీరకంగా నీరసించసాగాడు. నేను గనక ధైర్యం చెపుతూ, నవ్విస్తూ వుండనట్లయితే తాను మరణానికి చేరువవుతున్నాడనే భయం సుమంత్‌ని ఎప్పుడో పీడించి పిప్పి చేసేది.

ఒకరోజు సుమంత్ కుంగిపోయినట్లున్నాడు. మౌనంగా నీరసంగా కనిపించాడు. ఆ మౌనంలో నిస్పృహగోచరించసాగింది. ఎందుకో ఏమో మరి.... ఆరాత్రి పడుకోబోయే ముందు....

''ఏ జన్మలో చేసిన పాపమో ఇప్పుడు నన్ను వెంటాడుతోంది. చేయని తప్పుకి శిక్ష అనుభవిస్తు

న్నాను. నీకు ఏ సుఖాన్ని ఇవ్వలేకపోతున్నాను. విధి ఇంత క్రూరంగా ఆటలాడుకుంటుందని నేనెన్నడు ఊహించలేదు. విధి బలీయం అంటే ఇదేనేమో'' బాధతో పలికాడు సుమంత్.

''సుమంత్ లేనిపోనివి ఊహించుకొని మనస్సులో బాధ పెంచుకోకు'' అంటూ నేను సుమంత్ తల నిమురుతూ...

''పుట్టిన ప్రతీ వ్యక్తి ఏదో ఓ రోజు మరణించాల్సిందే. కాకుంటే ముందూ వెనుక అంతే. పావురం కోసం డేగ పొంచివున్నట్లు మృత్యువు మన వెన్నంటే వుంటుంది. మనిషి మరణానికి భయపడతాడు. భయపడుతూనే జీవిస్తాడు. నిజానికి జీవితానికి మరో పార్శ్వమే మృత్యువు. దాన్ని గురించి ఎవరూ భయపడనక్కర్లేదు'' అన్నాను.

''కళ్యాణి నువ్విప్పుడు అన్న మాటలు అక్షరసత్యాలు. అవి నా మనసులో నాటుకుపోయాయి. ఇక నుంచి ప్రతి క్షణం జీవించడానికే ప్రయత్నిస్తాను. మృత్యువును గురించి మరిచిపోయి దాన్ని గురించి భయపడడం మానేసి దాన్ని గురించి ఆలోచించకుండా జీవితం గడుపుతాను. దిగులుతో దుఃఖంతో అనవసరమైన ఆలోచనలతో సమయాన్ని వృధా కానివ్వను'' అంటూ సంతృప్తిగా కళ్లు మూసుకున్నాడు సుమంత్.

రోజులు, నెలలు సంవత్సరాలు గడుస్తున్న కొద్దీ సుమంత్ పరిస్థితి అంతకంతకూ క్షీణించసాగింది. బరువు కోల్పోతున్నాడు. ఆరోగ్యం మందగించసాగింది. వ్యాధి నిరోధకశక్తి తగ్గిపోవడంతో శరీరం ఒక మోడులా మారసాగింది. శరీరమంతటా వ్యాపించిన ఎయిడ్స్ కణాలు ఏమందులకూ లొంగడం లేదు. హెచ్ ఐవి తీవ్రతకు ప్రతిరూపంగా అతని శరీరం ఎముకుల గూడులా మారింది. ఆరోజు సుమంత్‌ని హాస్పిటల్‌లో జాయిన్ చేశాను. అతన్ని ప్రత్యేక వార్డులో వుంచారు. నేను క్షణం కూడా విడవకుండా సుమంత్‌ని అంటిపెట్టుకునే వుండిపోయాను.

''కళ్యాణీ...నేను నీకు క్షోభ తప్ప సుఖాన్ని ఇవ్వలేకపోయాను. నన్ను క్షమించు'' హాస్పిటల్‌కి వెళ్లిన మొదటి రోజు నా చేతుల్ని తన చేతుల్లోకి తీసుకొని సుమంత్ తన మనసులోని మాటను నెమ్మదిగా అన్నాడు.

''నాకు కష్టం కలిగించే మాటలు మాట్లాడకు సుమంత్'' హెచ్చరిస్తున్నట్లుగా అన్నాను నేను.

నా మనసులో పరిపరి విధాల ఆలోచనలు చెలరేగాయి. క్రమక్రమంగా సుమంత్ ముందు పొంచివున్న మృత్యువు మేమిద్దరం ప్రేమ పూర్వకంగా జీవించే పరిస్థితులను పూర్తిగా మార్చివేసే ప్రక్రియ మొదలైంది.

''ఈ జీవితమనే రైలు బండిలో నేను కూడా ప్రయాణీకురాలినే. ఎవరు... ఎప్పుడు... ఎక్కడ... ఎలా... ఎందుకు దిగిపోతారో, దిగిపోవాలో ఎవరికీ తెలీదు'' అనుకున్నాను.

మూడు రోజుల తరువాత సుమంత్ పరిస్థితి క్షీణించసాగింది. క్షీణించి..క్షీణించి తుది శ్వాస విడిచే ముందు నా చేతుల్ని తన చేతుల్లోకి తీసుకొన్నాడు సుమంత్. నేను అతని చేతుల్ని ప్రేమగా నిమిరాను. అతని చేతులు కూడా నా చేతుల్ని ప్రేమగా నిమిరిన అనుభూతి కలిగింది. నేను తలవంచి సుమంత్‌ని ప్రేమగా ముద్దాడాను.

సుమంత్ పెదాల మీద ప్రేమతో కూడిన చిరునవ్వు వెలిసింది. మరోమారు నా చేతుల్ని ప్రేమతో నిమిరి సంతోషంగా ప్రశాంత వదనంతో తనువు చాలించాడు సుమంత్.

ఆ క్షణంలో హృదయంలోని భారమంతా దిగిపోయిన మనిషిలా కనిపించాడు సుమంత్ తుది వీడ్కోలు పలికేంతవరకూ అతను సుఖంగా వుండేలా, అతని మనస్సు ప్రశాంతంగా వుండేలా ఏమైతే చేయాలో అన్నీ సవ్యంగా చేయగలిగే ధైర్యాన్నిచ్చినందుకు భగవంతునికి మనస్సులో కృతజ్ఞతలు తెలుపుకున్నాను. దాంతో సుమంత్ ఎటువంటి బాధ, కష్టం, నొప్పి, వ్యధ చెందకుండా ప్రశాంతంగా తనువు చాలించాడు.

సుమంత్‌కి వీడ్కోలు పలికే ఆ క్షణాన నా కళ్లలో నిరంతరంగా అశ్రుధారప్రవహిస్తున్నా నా బాధను పైకి తెలియనీయలేదు.

''ఇప్పుడు శ్రీమతి కళ్యాణి మాట్లాడతారు'' అంటూ వినపడ్డంతో నేను ఈ లోకంలోకి వచ్చాను.

''ప్రపంచం స్వార్థంతో కాదు త్యాగంతో నడుస్తుందని నా వుద్దేశం. ఆపదలో వున్నవారికి సానుభూతి చూపించడం సాంత్వన కలిగించడానికి, మానసిక ధైర్యం పెంపొందింపచేయడానికి మనమంతా కృషి చేయాలి. బాధల్లో వున్నవారిని ఆదునకోవాలనే మన సంస్కృతి మనకు ఏనాటి నుంచో నేర్పుతున్న పాఠం. ఎయిడ్స్ బాధితుల విషయంలోనూ ఈ సూత్రం వర్తిస్తుంది. నేను ఈ సందర్భంగా చెప్పదలుచుకున్నదల్లా ఎయిడ్స్ బాధితుల్ని అసహ్యించుకోకండి. అవమాన పరచకండి. ఆదరించండి అనే! వారికి కావలసింది కేవలం సానుభూతే కాదు మనందరి సహకారం కూడా'' అంటూ నా ప్రసంగం ముగించాను.

సభ అంతా నిశ్శబ్దమయిపోయింది. ఒక్క క్షణం తర్వాత కరతాళ ధ్వనులు మిన్నుముట్టాయి.

